## క్లుప్తంగా

### విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఉపయోగం



కొల్లిపర: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. శనివారం తూములూరు, వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర ఆయా గ్రామాల్లోని గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలను ఆమె సందర్శించారు. విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శిబిరంలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఆయా శాఖ గ్రంథాలయాధికారులు బి.సుబ్బారావు, బి.నాగ సాంబ శివనాయక్, జి.జ్యోతి, సత్యమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

### హరికథ కళాకారిణి రమణికి సత్కారం



తెనాలి: ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పెమ్మసాని థియేటర్‌లో బొబ్బిలిపులి సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయి మాధవ్ బుర్రా ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు. ప్రముఖ హరికథ, బుర్ర కథ కళాకారిణి యేమినేని రమణిని థియేటరు కమిటీ ఆధ్వర్యంలో వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, సయ్యద్ నిజాముద్దీన్, షేక్ సుబాని సత్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### వృద్ధురాలి మృతదేహానికి అంతిమ సంస్కారం



తెనాలి: శ్రీ శివలింగేశ్వర స్వామి భక్తబృంద సేవా సమితీ ఆధ్వర్యంలో శనివారం మేడూరి వీరమ్మ(70) అనే వృద్ధురాలి శవానికి అంతిమ సంస్కారాలు చేసింది. నాజరుపేట మేడిశెట్టివారి వీధిలో నివసించే వీరమ్మ భర్త గతంలోనే చనిపోయారు. ఆమె పిల్లలు లేరు. ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు మరణించడంతో.. ఆమె సోదరుడి విజ్ఞప్తి మేరకు..సేవా సమితి బుర్రిపాలెంరోడ్డులోని మహా ప్రస్థానంలో సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు పూర్తి చేసింది. సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, పోతురాజు, సభ్యులు ఉన్నారు. మహాప్రస్థానం కమిటీ అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణ ప్రసాద్ వారిని అభినందించారు.

### ఆట, పాటలతో ఆరోగ్యం



అత్తోట(కొల్లిపర): పిల్లలకు ఆట పాటలతో ఆర్యోగం, విజ్ఞానం పెరుగుతుందని ఎంపీటీసీ బొల్లిముంత పోతురాజు అన్నారు. శనివారం అత్తోట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐటీసీ ప్రథమ్, ఎం.స్వాతి ఆధ్వర్యంలో రెడీనెస్ మెళా కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు ఆట, పాటలు, విద్య వల్ల కలుగే ప్రయోజనాలను వివరించారు. పిల్లలను పరీక్షించి, రిపోర్ట్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు జి.శకుంతల, వై.నాగమణి, బి.నాగ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు హెల్పర్స్, ప్రీ స్కూల్ తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

### డీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

గుంటూరు ఎడ్యుకేషన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.నరహరి (తూర్పు గోదావరి), ఎన్.వి.రమణయ్య (నెల్లూరు) ఎన్నికయ్యారు. గుంటూరు అమరావతి రోడ్డులోని నవీన విద్యా సంస్థలో శనివారం నిర్వహించిన రాష్ట్ర 16వ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సీఈ జార్జ్, ఎస్.శ్రీనివాసరావు, పి.మాధవి, కార్యదర్శులుగా జి. మధు, ఆర్.వరుణ్‌కుమార్, జి. చంద్రశేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.త్రినాథరావు, సభ్యునిగా కె.ఎస్.ఎస్. ప్రసాద్, ఉపాధ్యాయ క్రాంతి పత్రిక ప్రధాన సంపాదకునిగా కె.రత్నం, సంపాదకులుగా పి.వి.డి. ప్రసాద్, ఎం.ఎస్.కె. కిశోర్ ఎన్నికయ్యారు.

# రాష్ట్ర సంక్షేమ పథకాలు.. దేశ చరిత్రలోనే ఒక విప్లవం

'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సేవా వజ్ర పురస్కారానికి ఎంపికైన వలంటీరు షేక్ షబ్బీర్‌ను సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్, ఖలేదా నసీమ్, కౌన్సిలర్లు

తెనాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ చరిత్రలోనే విప్లవాత్మకమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభిప్రాయపడ్డారు. పేదవాడి సంక్షేమమే నిజమైన అభివృద్ధిగా చెబుతూ, ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక భరోసా వారిని సంతోషంగా జీవించేలా చేస్తోందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 26 నుంచి 40 వార్డుల్లోని వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డుల ప్రదానోత్సవం శనివారం స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో జరిగింది. ముఖ్య అతిథి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, నెలనెలా 1వ తేదీనే ఇంటికొచ్చి పింఛను ఇస్తున్న వలంటీర్లను ప్రజలు తమ సొంత కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నారని చెప్పారు. గతంలో జన్మభూమి కమిటీల అవినీతితో టీడీపీ ప్రభుత్వమే కుప్పకూలిందని గుర్తుచేశారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎలాంటి వివక్ష లేకుండా, అవినీతికి పాల్పడకుండా పారదర్శకంగా సంక్షేమాన్ని అందిస్తున్న వలంటీర్, సచివాలయ వ్యవస్థల కారణంగా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందన్నారు. రాబోయే ఎన్నికల సంవత్సరం మరింత కీలకమన్నారు. ఎన్నడూ తెనాలిని చూడనివారు, కరోనా విపత్కర కాలంలో ప్రజలను పట్టించుకోనివారు దిగుతారని జోస్యం చెప్పారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ సేవతో మరోసారి ఆయన్ను అధికారంలోకి తీసుకురావాలని వలంటీర్లను కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మున్సిపల్ వైస్ చైర్మను మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు గోగిరెడ్డి మానసారెడ్డి, షేక్ నూర్ ఇస్మాయిల్, గొడవర్తి సాయిహరేరామ్, పేరం సంజీవరెడ్డి ప్రసంగించారు.

సేవా వజ్ర అవార్డుకు ఎంపికైన వలంటీరు షేక్ షబ్బీర్, సేవారత్న అవార్డులకు ఎంపికైన ఉప్పు వరమ్మ, వేజండ్ల శేఖర్‌తోపాటు సేవా మిత్ర అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే శివకుమార్ సత్కరించారు. కౌన్సిలర్లు యాతాటి అనిల్, కొమరాబత్తిన జయపాల్, అత్తోట నాగవేణి, ఆవుల కోటయ్య, తోట రఘురామ్, కో-ఆప్షన్ సభ్యులు బచ్చనబోయిన శ్రీనివాసరావు, పెచ్చింగ్ సుభాని, యార్డు డైరెక్టర్లు మాలోతు భిక్షాలు నాయక్, ఆర్.జ్యోత్స్న, పార్టీ నేతలు మన్నవ ప్రభాకర్, తాడిబోయిన హరిప్రసాద్, మట్లపూడి రాజేశ్వరరావు, సయ్యద్ గౌస్, గుర్రం హేమలత, రావి ప్రశాంతి, పెసర్లంక రమణ, మల్లెబోయిన రాము, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, అక్కిదాసు కిరణ్ పాల్గొన్నారు. అనంతరం ఇదే వేదికపై రూరల్ మండలంలోని మల్లెపాడు, గుడివాడ, కొలకలూరు-1, 2, నందివెలుగు-1, 2, పెదరావూరు-1, 2, తేలప్రోలు సచివాలయాల వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేసి, సత్కరించారు. తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, పెదరావూరు సర్పంచ్ కాకి రమాదేవి, నందివెలుగు సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్, కొలకలూరు సర్పంచ్ చొప్పర ప్రీతి, తేలప్రోలు సర్పంచ్ బాషా, నేలపాడు సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీలు షేక్ సిలార్‌జాని, పి.నాగదేవిక, కె.కిశోర్, ఆర్.సుజాత, ఆర్.ఏసుదాసు, పి.రత్నకుమారి, ఫరీద్, పినపాటి అనిల్, కొలకలూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో అభివృద్ధి పరుగులు

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



శస్త్ర చికిత్స చేయించుకున్న మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అంగలకుదురు గ్రామంలో శనివారం మూడో రోజు నిర్వహించారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ తిరిగారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీకి అనుకూల గ్రామం అంగలకుదురు గ్రామమన్నారు. 2014 ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేగా గెలిచాక రోడ్డు వేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారని, ఆ ఎన్నికల్లో గెలిచిన అప్పటి ఎమ్మెల్యే, ప్రభుత్వం కనీసం ఒక్క రోడ్డు వేయని పరిస్థితిని గుర్తుచేశారు. 2019లో తాను ఎమ్మెల్యేగా గెలిచాక గ్రామంలో రూ.21 కోట్లతో సంక్షేమ లబ్ధిని అందిచడమే కాకుండా, రూ. 4 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలను కోటి రూపాయలతో అభివృద్ధి చేశామని చెప్పారు. ఇదంతా గత ప్రభుత్వంలో జరుగలేదని వివరించారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. టిడ్కో గృహాలు బిల్లులు చెల్లించక గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక బిల్లులు చెల్లించి, గృహాలను సిద్ధం చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ముప్పవరపు సంధ్యారాణి, పేరం అరుణ, పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు, పార్టీ నేతలు జగన్మోహనరావు, కొండముది విజయ్, కిరణ్‌చంద్ర, చుండూరు గోపీ, కావూరు కిషోర్, షేక్ బాదుల్లా, అరవ బాజీ, మేస్త్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అందుకే ప్రజల్లో 'ఇంగ్లీష్'పై మోజు

- పరిపాలన, న్యాయస్థాన తీర్పులు తెలుగులోనే ఉండాలి
- తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రజా చైతన్య సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

తెనాలి: రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరిగిన విద్యా ప్రైవేటీకరణ/ కార్పొరేటీకరణను ఎవరూ అడ్డుకోలేదని, ఫలితంగానే ప్రజల్లో ఇంగ్లిష్‌పై మోజుకు కారణమైందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యలో 74 లక్షల విద్యార్థులుంటే అందులో 35 లక్షల మంది ప్రైవేటు/ కార్పొరేట్ పాఠశాలల్లోనే చదువుతున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో పరిపాలన తెలుగులో జరగాలనే అంశంపై శనివారం రాత్రి ఇక్కడి పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రజా చైతన్య సభకు కాకతీయ సహకార సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు అధ్యక్షత వహించారు. ప్రభుత్వ జీవోలు, చట్టాలు తెలుగులోనే ఉండాలని ఎమ్మెల్సీ కోరారు. కనీసం జిల్లా న్యాయస్థానాల వరకు ఇచ్చే తీర్పులు తెలుగులోనే ఇవ్వటం సమంజసంగా చెప్పారు. వీటిపై స్పష్టమైన డిమాండ్లతో ముందుకు వెళ్లాలని సూచించారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు తమ రోజువారి వ్యవహారాలు తెలుగులోనే జరుపుకోవాలని, పరిపాలన తెలుగులోనే జరిగేలా కృషిచేయాలని సూచించారు. ప్రజల్లో ఈరకమైన చైతన్యం తీసుకొచ్చేందుకు సమాఖ్య ఆధ్వర్యంలో ఏడాదిపాటు ప్రజా చైతన్య సభలను నిర్వహించనున్నట్టు తెలిపారు. సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ సమావేశకర్త డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు మాట్లాడుతూ.. అన్ని సంఘాలను కలుపుకుని ఉద్యమంలా భాషోద్యమం ముందుకు సాగాలని కోరారు. పట్టణ ప్రముఖులు కొత్తపల్లి రవిబాబు, జంగా వెంకటరెడ్డి, బెల్లంకొండ వెంకట్, యక్కల రామమోహనరావు, బొల్లిముంత కృష్ణ, యక్కల శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. సమాఖ్య కేంద్ర మండలి సభ్యులు డాక్టర్ సామల లక్ష్మణబాబు, యర్రంశెట్టి హనుమంతరావు పర్యవేక్షించారు.

# యువతలో క్రీడాస్ఫూర్తి..అభినందనీయం



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

తెనాలి: యువతలో క్రీడా స్ఫూర్తిని నింపే ప్రయత్నం అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. కేబీఎస్ అండ్ కేవైఆర్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంటులో రెండో రోజు శనివారం మ్యాచ్‌లను జంగాల అజయ్‌కుమార్, కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోలా అశోక్ ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. సామాజిక సేవా స్ఫూర్తితో పోటీలు జరపటం ముదావహమన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కృష్ణబలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్ మాట్లాడుతూ టోర్నమెంటు విజేతకు రూ.11 వేలు, రన్నర్‌కు రూ.5 వేల ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. పాల్గొన్న ప్రతి జట్టుకు క్రికెట్ కిట్‌ను అందించనున్నట్టు తెలిపారు. సీపీఐ పార్టీ నాయకులు బొల్లిముంత కృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, కొల్లిపర మండల కార్యదర్శి తుంగ బాలస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి కిరణ్, బిల్లా రాజేష్, యర్రంశెట్టి వేణు, అల్లూరి సాంబయ్య, జెమిని శ్రీను, కావేటి గోపీనాథ్, టోర్నమెంటు నిర్వాహకులు బత్తుల శ్రావణ్, కావేటి శివరాం, రాజశేఖర్, గద్దం రాజ్‌కుమార్, కుప్పల మోహన్ సాయి, అచ్యుత వేణు, కంభం అనిల్, కృష్ణ, ప్రదీప్, గణేష్, సతీప్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ బిల్లు చెల్లింపునకు అవకాశం

తెనాలి: తెనాలి డివిజన్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఏపీ సీపీడీసీఎల్ ఈఈ వీవీ చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్, మొబైల్ యాప్‌ల ద్వారా సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.

### నేడు సాహిత్యం, సంగీతంపై ప్రత్యేక ప్రసంగం

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 'సాహిత్యం-సంగీతం' అంశంపై ప్రత్యేక ప్రసంగం ఏర్పాటు చేసినట్టు అధ్యక్ష, కార్యదర్శులు మువ్వా సత్యనారాయణ, బొమ్మదేవర వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 6 గంటలకు జరిగే సభలో ప్రముఖ సంగీత విద్వాంసుడు 'కలైమామణి' డాక్టర్ తాడేపల్లి లోకనాథ శర్మ ప్రత్యేక ప్రసంగం చేస్తారని తెలిపారు. సంగీతాభిమానులు జయప్రదం చేయాలని కోరారు.

### నేడు ఫ్యాప్టో నిరసన ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ఉత్తర్వుల్లో అసంబద్ధ విధానాల్ని నిరసిస్తూ ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపు మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు డీఈవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు తెలిపారు. కన్నావారితోటలోని సంఘ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయ పోస్టులు బ్లాక్ చేయడం తగదని, అన్ని ఖాళీల్ని చూపించాల ని డిమాండ్ చేశారు. ఉద్యోగోన్నతులకు ఖాళీల్ని చూపించకుండా విల్లింగ్, నాట్ విల్లింగ్ అడగడం సరైన పద్ధతి కాదని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. ఖాలీద్ పాల్గొన్నారు.

# ప్రవాసాంధ్రుల కోసం..ఎన్టీఆర్ చిత్రాలు డిజిటలైజ్డ్


కళా ప్రముఖులకు సన్మానం



మోపర్తి రత్నకుమారిని సత్కరించిన సాయిమాధవ్



సత్కారం అందుకున్న మల్లాది గోపాలకృష్ణ



సంజీవి

తెనాలి: సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నటించిన 276 చిత్రాలను డిజిటలైజ్ చేయించి, ఉత్సవాల తర్వాత కూడా వీక్షించేందుకు వీలుగా విదేశాల్లోని తెలుగువారికి అందించనున్నట్టు ప్రవాస భారతీయుడు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి చెప్పారు. తెనాలిలో జరుగుతున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో వారానికి అయిదు రోజుల చొప్పున ఏడాదిపాటు ఎన్టీఆర్ నటించిన సినిమాలను ఉచితంగా ప్రదర్శించినట్టు చెబుతూ, విదేశాల్లోని తెలుగువారు ఆ సినిమాలను చూడాలన్న కోరికను వ్యక్తం చేయటంతో తానీ ప్రయత్నం చేపట్టినట్టు వివరించారు. ఎన్టీఆర్ శతజయంతి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఇక్కడి దేవీప్రియ ఫంక్షన్ హాలులో ఏర్పాటైన సభలో ముగ్గురు కళారంగ ప్రముఖులకు ఎన్టీఆర్ శతాబ్ది రంగస్థల పురస్కారాలను ప్రదానం చేశారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ కళల కాణాచి తెనాలి పేరును శతాబ్ది ఉత్సవాలు ద్విగుణీకృతం చేసి స్థిరపరిచినట్టు చెప్పారు. ఒంగోలుకు చెందిన ప్రఖ్యాత టీవీ, రంగస్థల నటీమణి మోపర్తి రత్నకుమారి, సుప్రసిద్ధ రూపశిల్పి, తెలుగు యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లాది గోపాలకృష్ణ, ప్రఖ్యాత సినీ, టీవీ, రంగస్థల నటుడు సంజీవిని ఎన్టీఆర్ శతాబ్ది రంగస్థల పురస్కారాలతో సత్కరించారు. ఆయా కళాకారుల గురించి ప్రముఖ రచయిత, ప్రయోక్త వల్లూరు శివప్రసాద్, సహజ కవి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ప్రముఖ రంగస్థల నటుడు అన్నమనేని ప్రసాద్ మాట్లాడారు. ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు స్వాగతం పలికారు. తాడిబోయిన హరిప్రసాద్, కాకుమాను కనకరాంబాబు ప్రభృతులు పాల్గొన్నారు.

# నర్సింగ్ ట్యూటర్స్‌గా పదోన్నతి



ప్రమోషన్ ఆర్డర్స్ అందజేస్తున్న డాక్టర్ యాస్మిన్

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభుత్వ సర్వీసులో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న 19 మందికి గ్రేడ్-2 నర్సింగ్ ట్యూటర్‌గా ప్రమోషన్ లభించింది. శనివారం గుంటూరులోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి ఉమ్మడి మూడు జిల్లాల్లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, నర్సింగ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న నర్సింగ్ ట్యూటర్ పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేశారు. ప్రభుత్వం 2020లో నర్సింగ్ కళాశాలల్లో ట్యూటర్ పోస్టులు భర్తీ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది ద్వారా ట్యూటర్ పోస్టులు భర్తీ చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. కొంత మంది బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ అభ్యర్థులు ఇన్ సర్వీసు అభ్యర్థుల ద్వారా కాకుండా నేరుగా పోస్టులు భర్తీ చేయడం ద్వారా తమకు ఉద్యోగాలు లభిస్తాయని కోర్టులో కేసు దాఖలు చేశారు. దీంతో 2020 నుంచి ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్‌పై కోర్టు స్టే విధించింది. ఇటీవల కాలంలో కోర్టు స్టే ఎత్తివేయడంతో శనివారం ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ కౌన్సిలింగ్ నిర్వహించి ప్రమోషన్స్ ఇచ్చారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో డెప్యూటీ డైరెక్టర్ అంజయ్య, సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లి రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ పి.పాల్ పాల్గొన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్స్ ఎట్టకేలకు లభించడంతో పలువురు నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ యూనియన్ నేతలు డాక్టర్ యాస్మిన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

**వైద్య సిబ్బందికి పదోన్నతులు**

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిలాల్లో పనిచేస్తున్న పలువురు వైద్య సిబ్బందికి శనివారం పదోన్నతులు లభించాయి. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ ఫిమేల్) గా పనిచేస్తున్న ఐదుగురికి హెల్త్ ఎడ్యుకేటర్స్‌గా పదోన్నతి లభించింది.

# భూసార పరీక్షలతో రైతులకు మేలు



నంబూరు రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతున్న డీపీడీ రామాంజనేయులు

పెదకాకాని: భూసార పరీక్షల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, నేల స్వభావం తెలుసుకుని పంటలు సాగు చేయవచ్చని గుంటూరు జిల్లా డెప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. రామాంజనేయులు తెలిపారు. మండలంలోని నంబూరు రైతు భరోసా కేంద్రంలో శనివారం భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీడీ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. భూసార పరీక్షల ద్వారా పైరుకు అవసరాన్ని బట్టి ఎరువులు వాడుకోవచ్చని సూచించారు. వరికి ముందుగా పచ్చిరొట్ట పైరు సాగు చేసి పూత దశలో రోటోవేటర్ వేసి నేలలో కలియదున్నడం ద్వారా సారవంతమవుతుందని తెలిపారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతి నెలా మొదటి శుక్రవారం ఆర్‌బీకే స్థాయిలో, రెండో శుక్రవారం మండల స్థాయిలో, మూడో శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశాలు జరుగుతాయన్నారు. వీటి ద్వారా రైతుల సమస్యలు ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు. సమావేశంలో ఏవో పి. సంధ్యారాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా

ప్రత్తిపాడు: ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. సంఘం ప్రత్తిపాడు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ప్రభుత్వ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ ఈ నెల 22న మొదలైన ఉద్యమం రోజురోజుకూ ఉద్ధృతం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ప్రసాద్, గుంటూరు సిటీ సహాధ్యక్షుడు పవన్, ఉపాధ్యక్షుడు పెద రత్తయ్య, ప్రత్తిపాడు తాలూకా యూనిట్ అధ్యక్షుడు చెన్నయ్య, కార్యదర్శి లాబాన్ పాల్గొన్నారు.

### పాఠశాలల ప్రారంభం రోజే యూనిఫాం పంపిణీ

కాకుమాను:మండలంలోని విద్యార్థులకు పాఠశాలలు పునఃప్రారంభం రోజునే యూనిఫాం అందజేయనున్నట్లు ఎంఈవో కె.ఎఫ్.కెనడీ తెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రానికి శనివారం యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలు చేరినట్లు చెప్పారు. మండలంలో మొత్తం బాలికలు 1412 మంది, బాలురు 969 మందికి గాను ఒక్కొక్కరికీ మూడు జతల యూనిఫాం అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 13,622 పాఠ్య పుస్తకాలు, 436 డిక్షనరీలు కూడా చేరినట్లు చెప్పారు. పాఠశాల ప్రారంభానికి ముందే ఆయా పాఠశాలల హెచ్ఎంలకు వీటిని పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో కెనడీ తెలిపారు.

### జీజీహెచ్‌కు ఫొటోగ్రఫీ యూనిట్ వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఎల్ఈడీ ఫొటోగ్రఫీ యూనిట్‌ను శనివారం జియోటెక్ హెల్త్ కేర్ ఇండియా నిర్వాహకులు సుంకర గోపీకృష్ణ బహూకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ పిల్లలు పుట్టిన సమయంలో కొంతమందికి జాండిస్ వస్తుందని, ఈ పరికరం ద్వారా దాన్ని గుర్తించి చికిత్స చేయవచ్చని తెలిపారు. ఈ యూనిట్ విలువ రూ. 25 వేలకు పైగా ఉంటుందన్నారు. పరికరాన్ని అందజేసిన గోపీకృష్ణను ఆమె అభినందించారు. కార్యక్రమంలో బయో మెడికల్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### డాక్టర్ నాగూర్ బాషాకు అవార్డు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా ఏపీ నుంచి తొలిసారిగా భూషణ్ పురస్కార్ అవార్డును అందుకున్నా రు. హైదరాబాద్‌లో ఈ నెల 21న గ్లోబల్ స్కా లర్స్ ఫౌండేషన్ నిర్వహించిన సమావేశంలో పద్మశ్రీ డాక్టర్ సాయిబాబా గౌడ్ చేతుల మీదు గా ఆయన అవార్డును అందుకున్నారు. రోగుల కు ఉత్తమ సేవలు అందించినందుకు ఫౌండేషన్ ఈ అవార్డును అందజేసింది.ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి డాక్టర్ షేక్‌నాగూర్‌బాషాను అభినందించారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు.

### పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ తప్పు కాదు

బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ జయప్రకాష్‌నారాయణ

గుంటూరు మెడికల్: పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం తప్పు కాదని, అమరావతిలో పేదల ఇళ్ల కోసం ప్రత్యేకంగా భూములున్నాయని బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం కుట్ర పన్నిందని ఆరోపించారు. ఇతర ప్రాంతాల వారిని తెచ్చి మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో గెలవాలనే ఆలోచనతో వారికి రాజధాని ప్రాంతంలో ప్రభుత్వం భూములు ఇస్తోందని ఆరోపించారు. బీజేపీ పశ్చిమ అసెంబ్లీ కన్వీనర్ తోట రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా అన్ని మండలాల్లో బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.